క్లుప్తంగా

వధువుకు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆశీర్వాదం



వధువును ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి

అనుమసముద్రంపేట: మండలంలోని దూబగుంట వైఎస్సార్‌సీపీ నేత శింగారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వసంత దంపతుల కుమార్తె సోనియారెడ్డి వివాహ నలుగుకు బుధవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి హాజరై వధువును ఆశీర్వదించారు. ఆయన వెంట కూనం సుధాకర్ రెడ్డి, సింగారెడ్డి రవి, ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి, డాక్టర్ ప్రణీత్ తదితరులు ఉన్నారు.

మేకపాటి ఆర్థిక సాయం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉదయగిరి: మండలంలోని వీరారెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన స్వర్ణా లక్ష్మయ్య మంగళవారం మృతి చెందిన నేపథ్యంలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మట్టి ఖర్చుల నిమిత్తం మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పంపించిన కొంత ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నేత జి.శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ముమ్మర ప్రచారం



ఆత్మకూరు: మైపాటివారికండ్రికలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు(చేజర్ల): అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వర్గాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీని గెలిపించాలని పార్టీ నాయకులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. బుధవారం మండలంలోని గాలిపాళెం, మైపాటివారికండ్రిక, వావిలేరు, దళితకాలనీల్లో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కరపత్రాలు అందజేసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రచార కార్యదర్శి వై.పెంచలయ్య, మైపాటివారికండ్రిక సర్పంచ్ మాతంగి పెంచలయ్య, వసంత నరసయ్య, ప్రసాద్‌బాబు, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత



పార్టీలో చేరిన వారితో రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తానని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం దుత్తలూరులోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నంబూరి రోశిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పలిశెట్టి రమణయ్య, ముత్తం నాగేశ్వరరావుతో పాటు పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి రాజగోపాల్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు నక్కా మల్లికార్జున, నంబూరి వెంకటసుబ్బారెడ్డి, రమణారెడ్డి, బడే మాల్యాద్రిరెడ్డి, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఎస్సార్‌లో ఘనంగా స్పోర్ట్స్ డే

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. జవహర్‌భారతి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మాల్యాద్రి, వశిష్ట జూనియర్ కళాశాల కరస్పాండెంట్ కోట సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు చదువులతో పాటు క్రమం తప్పకుండా క్రీడాసాధన చేయడం ద్వారా శారీరక, మానసిక దారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం కూడా పెరుగుతుందన్నారు. క్రీడల ద్వారా పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు, పరిస్థితులకు తగినట్లుగా వేగంగా స్పందించే మానసిక సామర్థ్యం అలవడుతుందని వివరించారు. అనంతరం స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్ రెడ్డి, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్వీ రమణారెడ్డి, కళాశాల పీడీ కిరణ్‌కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



ఏఎస్‌పేట: పింఛన్ కోసం సచివాలయం వద్ద ఎదురుచూపులు



ఆత్మకూరు: చేజర్ల మండలం యనమదల సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



జలదంకి: మండల కేంద్రంలో ఉన్న సచివాయలం వద్ద పడిగాపులు

నరకం చూపింఛెన్



సంగం: పింఛన్ కోసం ఎదురు చూస్తున్న పండుటాకులు

- పింఛన్ల కోసం సచివాలయాలకు పరుగులు
- అందరికీ ఒకే చోట ఇవ్వాల్సి రావడంతో బారులు తీరిన లబ్ధిదారులు
- చంద్రబాబు అండ్ కో మూకలకు శాపనార్థాలు పెట్టిన వృద్ధులు, దివ్యాంగులు

ఒక పక్క నిప్పులు చెరుగుతున్న ఎర్రని సూరీడు. అడుగు తీసి అడుగు వేయలేని వయో వృద్ధులు, దివ్యాంగులు ఊత కర్రలు, చక్రాల సైకిళ్ల సాయంతో, కుటుంబ సభ్యుల ఆసరా మండుటెండలో పింఛన్ కోసం సచివాలయాలకు చేరుకుని పడిన కష్టాలు వర్ణనాతీతం. అందరికీ ఒకే చోట ఇవ్వాల్సిన పరిస్థితితో లబ్ధిదారులు బారులు తీరారు. పల్లె నుంచి పట్నం వరకు ఆ అవ్వా తాతలు, ఆ దివ్యాంగులు పడిన, పడుతున్న కష్టాలు కళ్లారా చూసిన సామాన్య జన హృదయాలు ద్రవించాయి. కోడి కూతకు ముందే తలుపు తట్టి.. నిద్ర లేపి వలంటీర్లు ఇంటి ముగింట్లోనే అవ్వా, తాతలు, అక్కచెల్లెమ్మలకు, మంచంపైనే వయోవృద్ధులు, దివ్యాంగులకు, ఆస్పత్రిలో ఉన్నా.. పొలం పనుల్లో ఎక్కడ ఉంటే అక్కడే పింఛన్ అందజేశారు. వలంటీర్ వ్యవస్థపై పగబట్టిన పచ్చపార్టీ దాష్టీకానికి వీరందరూ నరకాన్ని చవిచూశారు. పచ్చమూకల కాలనాగుల విషకూటమి తమ రాజకీయాలకు నరకం చూ'పింఛెన్'ంది. ఏ సచివాలయంలో చూసినా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛన్‌దారులు చంద్రబాబుకు శాపనార్థాలు పెట్టడం కనిపించింది.

– నెట్‌వర్క్, సాక్షి



ఆత్మకూరు: వీఆర్‌ఓ సచివాలయం వద్ద పింఛన్లు అందజేస్తున్న దృశ్యం



ఉదయగిరి: సచివాలయం -3 వద్ద ఉదయం నుంచి వేచి ఉన్న లబ్ధిదారులు



కలిగిరి: సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు, లబ్ధిదారులు



కావలి: అల్లూరు సచివాలయం వద్ద లబ్ధిదారుల పడిగాపులు

టీడీపీ శిబిరం కుతకుత

- పాతాళంలోకి కూరుకుపోయిన పార్టీ పరిస్థితి
- చంద్రబాబు ప్రజాగళం అట్టర్‌ఫ్లాప్‌తో నైరాశ్యంలో కేడర్
- పవన్‌తో ప్రచారం చేయిద్దామని చెబుతున్న కావ్య
- చంద్రబాబును అవమానించడమే అంటున్న పార్టీ నేతలు

టీడీపీ అధినేత చంద్రబాబు, తనయుడు లోకేశ్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ చేస్తున్న రాజకీయాలతో ఆ పార్టీ పరిస్థితి క్షేత్రస్థాయిలో దారుణంగా మారింది. కావలిలో టీడీపీ అభ్యర్థిగా కావ్య కృష్ణారెడ్డిని ప్రకటించడంతో ఆ పార్టీ పాతాళంలోకి కూరుకుపోయింది. ఇటీవల చంద్రబాబు కావలిలో నిర్వహించిన ప్రజాగళం సభకు జనసమీకరణలో విఫలం కావడానికి కావ్య పోకడలే కారణమని ఆ పార్టీ నేతలు కుతకుతలాడిపోతున్నారు. జనసేన నేత పవన్‌కళ్యాణ్‌తో ప్రచారం చేయిద్దామని కావ్య చెబుతుంటే 'పుండు మీద కారం చల్లినట్లు'గా టీడీపీ కేడర్ రగిలిపోతున్నారు. పవన్‌కళ్యాణ్‌ను రప్పించమంటే చంద్రబాబును అవమానించడమే అంటున్నారు.

కావలి : కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి వైఖరికి ఆ పార్టీ శ్రేణులు అవమానంతో ముఖాలు చాటేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. కావ్య రౌడీమూకలు, నేర చరితులు, చిల్లర గాళ్లతో పాటు తన వద్ద పని చేసే ఉద్యోగులతో సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని అసలు సిసలైన టీడీపీ కేడర్‌ను పక్కన పెట్టేశారు. ఇక మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన నేతలను అయితే దరి కూడా చేరనీయడం లేదు. రోజు రోజుకు కావలిలో టీడీపీ పేరుతో సోషల్ మీడియాల్లో చేస్తున్న అసభ్యకర, దిగజారుడు ప్రచారాలతో నియోజకవర్గ ప్రజలు టీడీపీ అంటే అసహ్యించుకుంటున్నారు. ప్రజల్లో టీడీపీ నేతలమని చెప్పుకునే ధైర్యం, నమ్మకం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని పార్టీ శ్రేణులు వాపోతున్నాయి. అభ్యర్థిత్వం ఖరారు కాకముందు వరకు కార్యకర్తలతో కలిసిమెలిసి ఉన్న కృష్ణారెడ్డి టికెట్ ప్రకటించిన తర్వాత పెత్తనమంతా తన గుమాస్తాలు, దగ్గరి బంధువుల చేతిలో పెట్టడంతో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాగళం అట్టర్‌ఫ్లాప్‌తో టీడీపీ శ్రేణులు నైరాశ్యం

కావలిలో టీడీపీ అధినేత ప్రజాగళం సభ అట్టర్‌ఫ్లాప్ కావడం, జనం కోసం చంద్రబాబు గంట పాటు బస్సులోనే ఎదురు చూడటానికి ప్రధాన కారణం కావ్య కృష్ణారెడ్డేనని ఆ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారు. చంద్రబాబు హాజరయ్యే ప్రజాగళానికి కనీస ఏర్పాట్లు చేయకపోవడం, నాయకులు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వకుండా జనసమీకరణ బాధ్యత అంతా తన గుమాస్తాలకే అప్పగించడంతో కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ చేసి చంద్రబాబును ఘోరంగా అవమానించి పంపించారని టీడీపీ కేడర్ తీవ్రంగా మండి పడుతున్నారు. తనకు టికెట్ రానంత వరకు బీద రవిచంద్ర, నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు కాళ్ల చుట్టూ తిరిగిన కావ్య.. టికెట్ రాగానే వారికే ఏకు మేకయ్యాడని అంటున్నారు. నియోజకవర్గంలో బీద, మాలేపాటి ఊసే లేకుండా చేయాలని దుగ్ధతో వారి వర్గీయులకు చెక్ పెట్టే క్రమంలో పార్టీని పూర్తిగా పాతాళంలోకి తొక్కేశాడని టీడీపీ కేడర్ రగిలిపోతోంది. కావ్య పోకడలు, చంద్రబాబు ప్రజాగళం ఫ్లాప్‌తో ఆ పార్టీ శ్రేణులు నైరాశ్యంలో పడిపోయారు.

పవన్‌కళ్యాణ్‌కు పిఠాపురంలోనే దిక్కులేదు..

చంద్రబాబు సభ అట్టర్‌ఫ్లాప్ అయినా నష్టం లేదు, ప్రచారానికి పవన్ కళ్యాణ్‌ను పిలిపిస్తామని కావ్య చెబుతుండటంతో టీడీపీ అభిమానులు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. పవన్‌కళ్యాణ్‌ను కావలికి రప్పించి ప్రచారం చేయించడమంటే చంద్రబాబును అవమానించడమేనంటున్నారు. తమ అధినాయకుడికి కావలిలో జరిగినంత అవమానం రాష్ట్రంలో మరెక్కడా జరగలేదని, టికెట్ ఇచ్చినందుకు పార్టీ అధిష్టానం అంతా చింతించే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. ఇక పవన్‌కళ్యాణ్ వస్తే వచ్చే నాలుగు ఓట్లు కూడా పోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పవన్‌కు తాను పోటీ చేసే పిఠాపురంలోనే దిక్కులేదని, ఆయనే స్థానిక నేతల ప్రభపై ఆధారపడుతున్నారని సెటైర్లు వేస్తున్నారు. చంద్రబాబు సభనే అట్టర్‌ఫ్లాప్ చేసిన కావ్య కృష్ణారెడ్డిని నమ్మి పవన్ ఎందుకు ప్రచారానికి వస్తారని ఎదురు ప్రశ్నిస్తున్నారు.



పల్లా పార్టీ వీడినా.. మేమంతా మీవెంటే



రాజగోపాల్‌రెడ్డితో కాటేపల్లి గ్రామస్తులు

- మేకపాటికి సంఘీభావం తెలిపిన కాటేపల్లి గ్రామస్తులు

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి ఎంపీటీసీ పల్లా పురుషోత్తం ఇటీవల వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన నేపథ్యంలో బుధవారం ఆ గ్రామస్తులు దుత్తలూరులో ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని కలిసి ఎంపీటీసీ వీడినా మేమంతా మీవెంటే ఉంటామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచి ప్రలోభాలకు లొంగి ఎంపీటీసీ పార్టీని వీడడంపై వారు తీవ్రంగా ఆక్షేపించారు. ఎంపీటీసీ తల్లి పల్లా వెంకటమ్మ సైతం తాను వైఎస్సార్‌సీపీలోనే ఉండి జగన్‌కు మద్దతిస్తానని తెలిపారు. వీరితో పాటు ఆ గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అయినా ప్రతి ఒక్కరూ జగనన్నకు అండగా నిలబడేలా ప్రచారం చేయాలన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు

ఉదయగిరి: మండలంలోని సంజీవురాజుపల్లి, చెరువుపల్లి గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు బుధవారం రాత్రి మూలె వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయగిరిలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.



పార్టీలో చేరిన వారితో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

వివాహ వేడుకల్లో మేకపాటి



వివాహ వేడుకల్లో మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: మండలంలోని కొత్తపేటకు చెందిన నాగోతు ఎరుకలయ్య కుమార్తె నందిని వివాహ వేడుకలకు బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధువును ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు వాసుదేవరెడ్డి, తిరుపాల్‌నాయుడు, కండ్లగుంట వెంకటరెడ్డి, నాగోతు చిన్నా, దొంతిరెడ్డి ఓబుల్‌రెడ్డి, గోవిందు ఉన్నారు.

జలదంకి: జలదంకిలో కొండూరు శ్రీనివాసులరెడ్డి కుమార్తె వివాహ వేడుకలకు బుధవారం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. వధువు సుష్మ నలుగు కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. అనంతరం జేసీఎస్ కన్వీనర్ తిప్పారెడ్డి ఇందిరమ్మ నివాసంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డిని నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వంటేరు రామచంద్రారెడ్డి, నాయకులు వాకా మాధవరెడ్డి, సయ్యద్ ఖాజారంతుల్లా తదితరులు పాల్గొన్నారు.



వధువు సుష్మను ఆశీర్వదిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఉమ్మడి దారి వివాదంపై ఘర్షణ

- ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీదేవి

ఆత్మకూరు: మండలంలోని కరటంపాడులో మూడు కుటుంబాల మధ్య ఉమ్మడి దారి విషయంలో వివాదం ఏర్పడడంతో జరిగిన గొడవలో ముగ్గురు గాయపడ్డారు. ఆత్మకూరు ఎస్సై ముత్యాలరావు సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన శ్రీదేవి, వెంగయ్య, కొప్పోలు భారతమ్మ నివాసం ఉంటున్న వీధిలోనే మరో రెండు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే ఇటీవల వెంగయ్య కుటుంబీకులు తమ ఇంటి ముందు ఎత్తుగా గ్రావెల్ తోలారు. దీంతో ఆ దారి వెంట ఉన్న మరో రెండు ఇళ్ల వారు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు వారికి చెప్పినా వినకపోవడంతో సచివాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మెరకగా ఉన్న ఆ దారి వెంట నడవడం కష్టంగా ఉండడంతో వారి మధ్య వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో ఎం.శంకర్, ఉమ, లక్ష్మీ దాడి చేయడంతో శ్రీదేవి, వెంగయ్య, కొప్పోలు భారతమ్మ గాయపడ్డారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఇఫ్తార్ విందులో రాజారెడ్డి



ఉదయగిరి: మండలంలోని నందిపాడులో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన ముస్లిం వస్త్రధారణలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ అలీఅహ్మద్, కాలేషా, పోలక సుబ్బారెడ్డి, మౌలాలి పాల్గొన్నారు.

ఉదయగిరి: ఉదయగిరిలో బుధవారం రాత్రి ముస్లింలు ఇచ్చిన ఇఫ్తార్ విందుకు ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలను కలిసి వారికి రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న రాజగోపాల్‌రెడ్డి